
JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | సోమవారం 13-10-2025
Medchal - Malkajgiri | Monday 13-10-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 137 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 137 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com



## శవ రాజకీయాలు, దుష్ప్రచారంపై సీఎం చంద్రబాబు తీవ్ర హెచ్చరిక



- గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14న కీలక ఒప్పందం
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలకు ప్రాధాన్యత

**జయభేరి, విశాఖపట్నం :**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో ఒక చారిత్రక అధ్యాయం ప్రారంభం కానుందని, టెక్నాలజీ దిగ్గజం గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14న కీలక ఒప్పందం కుదుర్చుకోనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఇది తన రాజకీయ జీవితంలోనే ఒక అపూర్వ ఘట్టమని ఆయన అభివర్ణించారు. ఈ ఒప్పందంతో రాష్ట్రంలోకి గూగుల్ సంస్థ భారీ ఎత్తున పెట్టుబడులు తీసుకురానుందని, దీని ఫలితంగా విశాఖపట్నం దేశంలోనే అతిపెద్ద డేటా హబ్‌గా రూపాంతరం చెందనుందని తెలిపారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ పూర్తిగా దెబ్బతిన్నదని, ఇప్పుడు దానిని పునర్నిర్మించి పెట్టుబడులకు స్వర్గధామంగా

...మిగతాది 2 లో

## జూబ్లీహిల్స్ ప్రజలు కారు కావాలో బుల్డోజర్ కావాలో తేల్చుకోవాలన్న కేటీఆర్

- ఉప ఎన్నిక ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పాల
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్‌లోని పేదల ఇళ్ల పై బుల్డోజర్లు నడుపుతున్నారని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు



**జయభేరి, హైదరాబాద్ :**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి చిహ్నమైన 'కారు' గుర్తుకు ఓటేస్తారో, లేక విధ్వంసానికి ప్రతీకగా మారిన 'బుల్డోజర్'ను ఎంచుకుంటారో తేల్చుకోవాలని సూటిగా ప్రశ్నించారు. ఈ ఉప ఎన్నిక ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో షేక్‌పేట్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు చెర్క మహేశ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరిన

...మిగతాది 2 లో

## ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్ మహానగరం పరిధిలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సోమవారం (అక్టోబర్ 13) ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. సోమవారం అక్టోబర్ 13 నుంచి ఈ నెల 21 వరకు ప్రభుత్వ సెలవు దినాలు మినహా నామినేషన్లను స్వీకరిస్తారు. అభ్యర్థులు తమ నామినేషన్లను షేక్ పేట్ ఎమ్మార్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ ఆఫీస్‌లో సమర్పించాల్సి ఉంటుంది. నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేసేందుకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని ఎన్నికల అధికారులు తెలిపారు.

**జయభేరి, హైదరాబాద్ :**

అక్టోబర్ 22న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అలాగే అక్టోబర్ 24వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు సాయంత్రం అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరగనుంది. నవంబర్ 14న యూసఫ్ గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేసి ఫలితాలను అదే రోజు ప్రకటిస్తారు. ENCORE పోర్టల్ ద్వారా డిజిటల్ నామినేషన్ సమర్పించేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. అభ్యర్థులు https://encore.eci.gov.in ద్వారా నామినేషన్ ఫారం ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. అయితే QR కోడ్‌తో కూడిన ప్రింటెడ్ హార్డ్ కాపీ తప్పనిసరిగా సమర్పించాలని ఎన్నికల అధికారులు తెలిపారు. ఆన్‌లైన్ డిపాజిట్ బ్యాంక్/ట్రెజరీలో క్రెడిట్ అయి ఉండాలి; లేకపోతే మాన్యువల్ డిపాజిట్ చేయాలి. మరిన్ని వివరాలకు రిటర్నింగ్ ఆఫీసర్‌ను సంప్రదించాలన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం తుది ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి, బీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఇప్పటికే విడుదల చేశారు. మొత్తం 3 లక్షల 98 వేల 982 మంది ఓటర్లు ఉండగా ఇందులో 2,07,367 మంది పురుష ఓటర్లు ఉండగా, 1.91,590 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అలాగే ఇతరులు 25 మంది ఉన్నారని ప్రకటించారు. నియోజకవర్గం ఓటర్లలో 80 ఏండ్లకు పైబడిన వృద్ధుల్లో పురుషులు 3,280 మంది, మహిళలు 2,772 మంది ఉన్నారు. ఇక ఎన్ఆర్ఐ ఓటర్లు 95 మంది కాగా, సర్వీస్ ఎలక్టోరల్స్ 18, పీడబ్ల్యూడీ ఓటర్లు 1,891 మంది నమోదయ్యారు. నియోజకవర్గంలో 407 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతితో అనివార్యమైన జూబ్లీహిల్ష్ ఎన్నికలు.. అన్ని రాజకీయ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారింది. ఎవరికి వారు ఈ స్థానం కైవసం చేసుకునేందుకు వ్యూహ ప్రతివ్యూహాలతో సిద్ధమవుతున్నారు.

## విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలు

ఐటీ కంపెనీలకు విశాఖ డెస్టినేషన్ సిటీ అంటోంది ఏపీ సర్కార్. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడుల్లో 50శాతం విశాఖకే వస్తున్నాయని చెప్పారు మంత్రి నారా లోకేష్. విశాఖ కేంద్రంగా 4 జిల్లాలతో ఎకనమిక్ కారిడార్ ఏర్పాటు చేస్తామని వివరించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే.. ఏపీ బుల్లెట్ ట్రైన్‌లా అభివృద్ధిలో దూసుకుపోతుందని తెలిపారు.



- డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి
- మంత్రి నారా లోకేశ్

**జయభేరి, విశాఖపట్నం :**

ఏపీ ఆర్థిక రాజధాని అంటూ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. 2047 నాటికి విశాఖ ఆదాయం 1 ట్రిలియన్ డాలర్‌కు చేరుతుందని చెప్పారు. సిఫీ ఫస్ట్ ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండ్ స్టేషన్‌కు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్, స్థానిక నేతలు, సిఫీ ఛైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ.. పెట్టుబడులు విషయంలో ఇతర రాష్ట్రాలతో కాదు.. ఇతర దేశాలతో ఏపీ పోటీ పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడుల్లో 50శాతం విశాఖకి వస్తున్నాయని చెప్పారు. గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, సత్వ లాంటి టెక్ దిగ్గజాలన్నీ విశాఖలో కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నాయని, వీటితో 5 లక్షల ఐటి ఉద్యోగాలు విశాఖలో కల్పిస్తామని లోకేష్ వివరించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే.. ఏపీ బుల్లెట్ ట్రైన్‌లా అభివృద్ధిలో దూసుకుపోతుందని నారా లోకేష్ చెప్పారు.. విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తున్నాయని, 14వేల కోట్లు విశాఖ స్టీల్ ప్లాంట్‌కి ఇచ్చామన్నారు. కొద్ది నెలల్లోనే అనేక సంస్థలు విశాఖలో తమ కార్యకలాపాలు ప్రారంభిస్తాయని తెలిపారు. ఇది తొలి అడుగు మాత్రమే అన్న లోకేష్. కంపెనీలు తీసుకు రావడమే కాదు.. అన్ని విధాలా ఆర్థిక వృద్ధి సాధిస్తామని తెలిపారు.

## దామన్న కృషితోనే నల్గొండ జిల్లాకు గోదావరి నీళ్లు



**జయభేరి, సూర్యాపేట జిల్లా :**

సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి దివంగత రాంరెడ్డి దామోదర్ రెడ్డి దశదినకర్మ, సంతాప సభ కార్యక్రమానికి ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహచర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, కార్పొరేషన్ ఛైర్మన్లు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించడం జరిగింది. ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి ఖమ్మం

...మిగతాది 2 లో




## బండ్లగూడ జాగీర్‌లో... పార్కు స్థలాలను కాపాడిన హైడ్రా

**జయభేరి, హైదరాబాద్ :**

రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీలో శనివారం రెండు పార్కులను హైడ్రా కాపాడింది. శనివారం పద్మశ్రీ హిల్స్ కాలనీలోని 2600 గజాల పార్కు స్థలాన్ని రక్షించింది. 1983లో 10 ఎకరాల విస్తీర్ణంలో 230 ప్లాట్లతో లే ఔట్ వేయగా.. ఇందులో 2600ల గజాల స్థలాన్ని పార్కుకోసం కేటాయించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీ అధికారులు ఈ పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించి అభివృద్ధి చేయడానికి ప్రయత్నించగా.. పక్కనే ల్యాండ్ ఉన్న వారు ఈ స్థలం తనదంటూ అడ్డుకోవడంతో ఆ పనులు ఆగిపోయాయి.

...మిగతాది 2 లో



## మోదీకి ట్రంప్ ఆహ్వానం

- 'గాజా శాంతి' సమావేశానికి రావాలని పిలుపు
- ఈజిప్టు అధ్యక్షుడు అల్-సిసి నుంచీ ఆహ్వానం
- నేడు 20కి పైగా దేశాధినేతల సమక్షంలో ఒప్పందం
- భారత్ తరఫున కేంద్ర మంత్రి కేవీ సింగ్ ప్రాతినిధ్యం

**జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 12:**

ఈజిప్టులో సోమవారం జరగనున్న గాజా శాంతి ఒప్పంద కార్యక్రమానికి హాజరు కావాలని ప్రధాని మోదీని అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్‌సిసి ఆహ్వానించారు. కార్యక్రమానికి చివరి నిమిషంలో శనివారం మోదీకి ఆహ్వానం అందిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే గాజా స్ట్రిప్‌లో యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ శిఖరాగ్ర సమావేశంలో భారత్ తరఫున విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ పాల్గొంటారని వెల్లడించాయి. ఈజిప్టు అధ్యక్ష ప్రతినిధి తెలిపిన వివరాల ప్రకారం.. ట్రంప్, అబ్దేల్ ఫత్తాహ్ అల్‌సిసి అధ్యక్షతన 20కి పైగా దేశాల నాయకుల సమక్షంలో సోమవారం మధ్యాహ్నం షర్మ్‌ఎల్ షేక్‌లో గాజా శాంతి ఒప్పందం జరగనుంది. ఈ కార్యక్రమానికి ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఇటలీ ప్రధాని మెలోనీ, స్పెయిన్ ప్రధాని సాంచెజ్, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తదితర నాయకులు హాజరు కానున్నారు.

మొదటిపేజీ తరువాయి

## బండ్లగూడ జాగీర్‌లో...

పద్మశ్రీనగర్ కాలనీ నివాసితులు హైడ్రాకు ఇదే విషయాన్ని ఫిర్యాదు చేయగా.. స్థానికి రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించి పార్కుకు కేటాయించిన స్థలంగా హైడ్రా నిర్ధారించుకుంది. శనివారం పార్కు స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది. ఈ కాలనీకి ఆనుకుని ఉన్న పీఎన్‌టీ కాలనీలోని డి బ్లాక్‌లో మరో 1112 గజాల పార్కు స్థలానికి కబ్జాల చెర నుంచి శనివారం విముక్తి కల్పించింది. ఇలా మొత్తం 3712 గజాల పార్కు స్థలాలను కాపాడి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. గతంలో కూడా పీ అండ్ టీ కాలనీలోని సి, బి బ్లాకుల్లో ఉన్న 4400ల గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడిన విషయం విధితమే.

## దామన్న కృషితోనే నల్గొండ జిల్లాకు గోదావరి నీళ్లు

జిల్లాకు రాంరెడ్డి సోదరులు చేసిన అభివృద్ధి, సంక్షేమం మరువలేనివి. కాంగ్రెస్ పార్టీకి రాంరెడ్డి కుటుంబం చేసిన సేవలు చిరస్మరణీయం. చివరి క్షణం వరకు కూడా తుంగతుర్తి ప్రజల కోసం పాటుపడిన వ్యక్తి దామన్న. ఖమ్మం జిల్లా కారేపల్లిలో ఒక రైతు కుటుంబంలో జన్మించిన దామోదర్ రెడ్డి సాగునీరు ప్రాముఖ్యత, వ్యవసాయం యొక్క ప్రాధాన్యత తెలిసిన వ్యక్తి అందుకే గతంలో ఎడారిగా ఉన్న తుంగతుర్తి ప్రాంతానికి పట్టుబట్టి గోదావరి జలాలను ఎస్సారెస్పీ స్టేజి 2 ద్వారా సాధించిన ప్రజానేత దామోదర్ రెడ్డి. దామోదర్ రెడ్డి తుంగతుర్తి ప్రాంతానికి చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. వారి కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్ఆర్ఎస్పీ ఫేజ్ 2కు దివంగత రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు పెట్టి, రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఎస్ఆర్ఎస్పీ ఫేజ్ 2గా నామకరణం చేసి.. దామోదర్ రెడ్డి సేవలకు అంకితం చేసేలా ప్రకటించడం గొప్ప విషయం.

## జూబ్లీహిల్స్ ప్రజలు కారు కావాలో..

సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్‌లోని పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడుపుతున్నారని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులు, చట్టబద్ధమైన పత్రాలు ఉన్నప్పటికీ, వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా గరీబుల నివాసాలను కూల్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. "కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి జరగదు, బుల్డోజర్లు మాత్రమే వస్తాయి. ప్రజలు ఈ విషయాన్ని స్పష్టంగా గ్రహించాలి" అని ఆయన హెచ్చరించారు. రెండు సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని, ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. అభివృద్ధిని గాలికి వదిలేసి, రాష్ట్రాన్ని రూ. 2.80 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు.ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. నెలకు రూ. 4 వేల పెన్షన్ వంటి హామీలు అమలు కావాలంటే, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించడమే మార్గమని అన్నారు. "ఈ ఎన్నికలో అధికార పార్టీ ఓడిపోతేనే వారికి భయం పుట్టి హామీలను అమలు చేస్తారు. ఒకవేళ పొరపాటున గెలిపిస్తే, మనం ఎన్ని మోసాలు చేసినా ప్రజలు ఏమీ చేయలేరనే ధీమాతో ఉంటారు" అని వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్లు, అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ పదవి, ముస్లింలకు ఖబరస్థాన్ స్థలం వంటి విషయాల్లోనూ కాంగ్రెస్ మోసపూరితంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. "ప్రజలను తెలిసి తెలిసి మోసం చేయడమే రేవంత్ రెడ్డి నైజం. గతంలో 'మోసం చేసే వాళ్లనే ప్రజలు నమ్ముతారు' అని ఆయనే స్వయంగా చెప్పారు" అని కేటీఆర్ గుర్తుచేశారు.ఈ సందర్భంగా బీజేపీపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి ఏమాత్రం పనికిరాని పార్టీ అని, కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయడం అంటే ఆ ఓటును మోరీలో వేసినట్లేనని ఆయన ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఓటుకు రూ. 10,000 పంచి గెలవాలని చూస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ నగరం తిరిగి అభివృద్ధి పథంలో పయనించాలంటే కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలని, అందుకు జూబ్లీహిల్స్ నుంచే నాంది పలకాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రెండేళ్లుగా కేసీఆర్‌ను తిట్టడం మినహా రేవంత్ రెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు.

## శవ రాజకీయాలు, దుష్ప్రచారంపై సీఎం చంద్రబాబు తీవ్ర హెచ్చరిక

మారుస్తున్నామని అన్నారు.ఒకవైపు డేటా సెంటర్, మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యం అందించేలా కరిక్యులమ్‌ను తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా కొందరు అడ్డుకోవడం, బెదిరింపులకు పాల్పడటం ఒక ఫ్యాషన్‌గా మారిందని, ఇది మంచి పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు నవంబర్‌లో జరగనున్న పెట్టుబడుల సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షిస్తూనే, మరోవైపు ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న కల్తీ మద్యంపై ఉక్కుపాదం మోపుతామని చంద్రబాబు హెచ్చరించారు. ఈ సందర్భంగా కల్తీ, నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు రూపొందించిన 'ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్'ను ఆయన ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా వినియోగదారులు మద్యం బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, దాని తయారీ తేదీ, సమయం, బ్యాచ్ నెంబర్ వంటి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. మద్యం బాటిళ్లకు, దుకాణాలకు జియో ట్యాగింగ్, జియో ఫెన్సింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామని, దీనివల్ల బెల్ట్ షాపులకు పూర్తిగా అడ్డుకట్ట పడుతుందని వివరించారు. మద్యం సంబంధిత ఫిర్యాదుల కోసం 14405 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశామని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.గత ప్రభుత్వ హయాంలో కల్తీ మద్యం ఏరులై పారిందని, జంగారెడ్డిగూడెంలో 27 మంది చనిపోతే కనీసం విచారణ కూడా జరపలేదని చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. సొంత మనుషులకు చెందిన బ్రాండ్లతో మొత్తం వ్యవస్థను నాశనం చేసిన వారు, ఇప్పుడు తమ ప్రభుత్వంపై బురద జల్లేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అనారోగ్యంతో చనిపోయిన వారిని కూడా కల్తీ మద్యం మృతులుగా చిత్రీకరిస్తూ శవ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. "వాళ్లే నేరాలు చేస్తారు, ప్రభుత్వానికి అంటగడతారు, అలజడి సృష్టించి సీబీఐ విచారణ కావాలంటారు. వివేకా హత్య కేసులో ఏం జరిగిందో అందరూ చూశారు. ఇలాంటి కుట్రలను, శవ రాజకీయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం," అని ఆయన హెచ్చరించారు. తప్పు చేసిన వారు అధికారులు, రాజకీయ నాయకులు ఎవరైనా సరే కఠిన చర్యలు తప్పవని, అదే సమయంలో ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేసే వారిని కూడా వదిలిపెట్టబోమని చంద్రబాబు స్పష్టం చేశారు.

## నవంబర్ 26న పౌల్ట్రీ ఇండియా ఎక్స్ షో

జయభేరి, హైదరాబాద్ :

శరీరానికి తగిన పోషణ, ఆరోగ్య పరిరక్షణకు ప్రతిరోజూ కోడిగుడ్డు తినాలని వక్తలు అన్నారు. ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఈఎంఏ) ఆధ్వర్యంలో నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ సహకారంతో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో వరల్డ్ ఎగ్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెంకటేశ్వర హేచరీస్ గ్రూప్ ప్రతినిధి కేజీ ఆనంద్ ఈక్వెస్ట్రియన్ చాంపియన్ శుశ్రుత కుమార్, పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన దేశం ప్రపంచంలోనే గుడ్ల ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉన్నప్పటికీ 2024లో వార్షిక తలసరి వాడకం కేవలం 108 గుడ్లేనని అన్నారు. ఎన్డే లాంటి సమయాల్లోనైనా గుడ్డు ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని కోరారు. నవంబర్ 20 నుంచి 28 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ పౌల్ట్రీ ఇండియా ఎక్స్పో 2025 పేరుతో దక్షిణ ఏషియాలోనే అతిపెద్ద పౌల్ట్రీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎక్స్పోలో 50 దేశాలకు చెందిన 500 మంది ఎగ్జిబిటర్లు, 50 వేల మందికి పైగా సందర్శకులు పాల్గొంటారన్నారు. పౌల్ట్రీ బ్రీడింగ్, ఆటోమేషన్, వెటనరీ సైన్స్, సుస్థిర ఫార్మింగ్ తదితర అంశాల్లో వస్తున్న అత్యాధునిక ఆవిష్కరణలపై చర్చించనున్నట్లు తెలిపారు. నవంబర్ 25న ఒక ప్రత్యేక నాలెడ్జ్ డేను హైదరాబాద్ నోవాటెల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కోళ్లకు వస్తున్న వ్యాధులు, మేత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిష్కారాలు, ఈ రంగంలో కెరీర్ అవకాశాలు తదితర అంశాలపై నిపుణులతో సెమినార్లు ఉంటాయన్నారు.


# మోహన్ బాబు స్టోరీలో అదే నీతా..

**కర్మ రిటర్న్స్ అన్న సిద్ధాంతం సినీ నటుడు మోహన్‌బాబుకు అతికినట్టు సరిపోతుందన్న అభిప్రాయం బలపడుతోంది వివిధ వర్గాల్లో. బాబూ.. మోహన్ బాబూ రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవయ్యా.... ఇక కాస్కో అని ఏపీ ప్రభుత్వ పెద్దలు కూడా సంకేతాలు పంపుతున్నట్టు అంచనా వేస్తున్నారు తాజా పరిస్థితుల్ని దగ్గరగా గమనిస్తున్న వాళ్ళు.**

జయభేరి, తిరుపతి, అక్టోబరు 12:



ఇక అసలు విషయానికొస్తే.... దాదాపు దశాబ్దానికి పైగా టీడీపీ అధినేత చంద్రబాబు, మోహన్ బాబు మధ్య మాటల్లేవ్. గతంలో తెలుగుదేశం పార్టీకి సొంత మనిషిలా ఉండే మోహన్‌బాబు... ఆ తర్వాత రకరకాల కారణాలతో దూరమై చాలా కాలంగా పార్టీతో, చంద్రబాబుతో విభేదిస్తున్నారు. ఆ క్రమంలోనే... 2019 అసెంబ్లీ ఎన్నికలకు ముందు వైసీపీకి జై కొట్టారాయన. అదే ఊపులో అప్పుడు సీఎం చంద్రబాబును గట్టిగా టార్గెట్ చేశారు.ఇంకా చెప్పాలంటేనాడు టీడీపీని ఓడించడమే లక్ష్యంగా పనిచేశారన్నది ఎక్కువ మంది అభిప్రాయం. కానీ... వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీతో కూడా టచ్ మీ నాట్ అన్నట్లుగానే ఉన్నారు. అందుకు కారణాలు కూడా చాలానే ఉన్నాయట. తాను కోరుకున్న ఫ్యాన్ పార్టీ అధికారంలోకి రాగానే టీటీడీ ఛైర్మన్ లేదా రాజ్యసభ సీటు ఆశించారట మోహన్‌బాబు. ఆ రెండూ కాకున్నా... చివరికి ఫిలిం డెవలప్ మెంట్ బోర్డు ఛైర్మన్ పదవి అయినా కావాలని తెగ ఆరాటపడ్డారట అప్పట్లో. కానీ... నో యూజ్. ఏ పదవీ దక్కలేదు. పైగా అంతకు ముందు టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ బకాయిల కోసమైతే... తాను విద్యార్థులతో కలిసి రోడ్డెక్కారో... ఆ బకాయిల్ని కూడా పూర్తి స్థాయిలో ఇప్పించుకోలేక ఛీ ఇదా నా పరిస్థితి అంటూ చతికిలపడ్డారట పెదరాయుడు. జగన్ దగ్గర నా పరపతి అరచేతి మందాన ఉందని గొప్పలకు పోయిన మోహన్‌బాబుకు చివరికి తత్వం బోధపడి మెల్లిగా బీజేపీకి దగ్గరైనట్టు చెప్పుకుంటారు. తన విద్యా సంస్థలకు ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ విషయంలో 2019 ఎన్నికలకు ముందు మోహన్ బాబు చేసిన హంగామా అంతా ఇంతా కాదు.నాటి టీడీపీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ....విద్యార్థులతో కలిసి నడి రోడ్డు మీద కూర్చుని మోహన్‌బాబు చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. ఆ విషయాన్ని ఇప్పటికీ గుర్తు చేసుకుని ఫైరైపోతుంటారు తమ్ముళ్ళు. ఆ ఎపిసోడ్‌లో ప్రతిపక్షంగా వైసీపీ చేసిన హడావిడికంటే... మోహన్‌బాబే చాలా ఎక్కువ చేశారన్న అభిప్రాయం ఇప్పటికీ బలంగా ఉందట ఉమ్మడి చిత్తూరు జిల్లా తెలుగుదేశం కేడర్‌లో. అందుకే ప్రస్తుతం ఆయన తమ మిత్రపక్షం బీజేపీకి దగ్గరైనా... సంబంధంలేని వ్యక్తిగానే చూస్తుంటారు. అదే సమయంలో మోహన్‌బాబు విషయంలో సీఎం చంద్రబాబు మెతక వైఖరి అవలంభిస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేసే టీడీపీ లీడర్స్‌కు కూడా కొదవ లేదు. చంద్రబాబు వైఖరి వల్లే... ఛాన్స్ దొరికినప్పుడల్లా మోహన్ బాబు టీడీపీ మీద విషం చిమ్ముతూ ఉంటారని బహిరంగంగానే విమర్శిస్తుంటారు తమ్ముళ్ళు. కానీ... అదంతా పాత లెక్క అని చెబుతున్నాయట తాజా పరిణామాలు. పెదరాయుడికి ఊహించని షాక్ ఇచ్చింది ఏపీ ప్రభుత్వం. ఇది చూసిన కొందరు టీడీపీ కార్యకర్తలు అవునా... నిజమా... అని ముక్కున వేలేసుకుంటుంటే... ఇంకొందరు మాత్రం ఓ అడుగు ముందుకేసి ఇప్పటిదాకా ఒక లెక్క, ఇక నుంచి మరో లెక్క అంటూ సినిమా డైలాగ్స్ చెప్పేస్తున్నారటగతంలో ఏ ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ కోసం రోడ్డెక్కి చంద్రబాబు, టీడీపీ మీద పెద్ద ఎత్తున విమర్శలు చేశారో... అవే నిధులు, కాలేజ్ ఫీజుల మళ్ళింపు వ్యవహారంలో ఇప్పుడు మోహన్‌బాబు ఇరుక్కోవడం చూసి కర్మ రిటర్న్స్ అంటే ఇదేనంటూ కామెంట్స్ చేస్తున్నారు టీడీపీ కార్యకర్తలు. మోహన్‌బాబు యూనివర్శిటీలో తమ దగ్గర అడ్డగోలుగా డబ్బులు పిండుకుంటున్నారంటూ.. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో విచారణకు ఆదేశించింది ఉన్నత విద్యామండలి. విచారణ తర్వాత కాలేజీ మూసివేత, 15 లక్షల రూపాయల ఫైన్ తో పాటు విద్యార్థుల నుంచి వసూలు చేసిన అదనపు సొమ్ము 26 కోట్ల రూపాయలను 15 రోజుల లోపు తిరిగి చెల్లించాలని చెప్పడం మోహన్‌బాబు ఊహించని షాకేనంటున్నారు. దీంతో అవాక్కయిన టీడీపీ కేడర్... ఇది నిజంగా మన ప్రభుత్వమేనా? అలాంటి చర్యలకు ఆదేశించింది నిజమేనా అంటూ తమను తాము గిల్లి చూసుకుంటున్నారట.కొద్దిమంది చిత్తూరు జిల్లా సీనియర్స్ అయితే... ఈ విషయంలో చంద్రబాబు ప్రమేయం పెద్దగా ఉండకపోవచ్చని, అంతకు మించి లోకేష్ పూనుకుని గట్టిగా వ్యవహరించి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. తప్పును తప్పు అని చెప్పడానికి కూడా భయపడాల్సిన అవసరం లేదని, లోకేష్ ఆదేశాలతోనే ఉన్నత విద్యా మండలి స్వేచ్ఛగా విచారణ జరిపి ఈ తరహాలో కఠిన నిర్ణయం తీసుకుందన్న అభిప్రాయం ఉంది సీనియర్స్‌లో. మోహన్ బాబు గతంలో ఎలా వ్యవహరించాడో... అందరికీ తెలుసు కాబట్టే... లోకేష్ తండ్రిలా కాకుండా... ఛాన్స్ దొరికింది కాబట్టి ఓ ఆటాడేసుకుంటున్నారన్న చర్చ గట్టిగా జరుగుతోంది జిల్లాలోదానికి తోడు మోహన్ బాబు రెండో కుమారుడు మంచు మనోజ్ సైతం నేరుగా లోకేష్‌ను పలుమార్లు కలసి తనతో నాన్న, అన్న ఎలా వ్యవహరించారో వివరించారట. కారణాలు ఏవైనాగానీ... మోహన్‌బాబు విషయంలో చంద్రబాబులాగా కాకుండా...లోకేష్ గట్టిగా నిర్ణయాలు తీసుకున్నారంటూ... ఉమ్మడి చిత్తూరు టీడీపీ కేడర్ ఖుషీగా ఉన్నట్టు సమాచారం. ఇదే విషయాన్ని సోషల్ మీడియా వేదికగా చర్చకు పెట్టేస్తున్నారు. మన్తో ఎంటర్టైన్‌మెంట్ మామూలుగా ఉండదు మరి అంటున్నారు టీడీపీ లీడర్స్. చినబాబు యాక్షన్‌కు పెదరాయుడు రియాక్షన్ ఎలా ఉంటుందోనని ఆసక్తిగా గమనిస్తున్నాయి రాజకీవర్గాలు.



## తనను తప్పించడంపై దీపికా హాట్ కామెంట్స్

జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 12:

స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ప్రభాస్ 'స్పిరిట్' మూవీ నుంచి దీపికా స్థానంలో 'యానిమల్' బ్యూటీ త్రిప్తి డిమ్రీని తీసుకున్నారు. ఆ తర్వాత తన స్టోరీని లీక్ చేశారంటూ పెట్టిన ట్వీట్ కూడా హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై దీపికా సైతం పరోక్షంగా స్పందించారు. ఇక రీసెంట్‌గా ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ 'వైజయంతీ మూవీస్' కూడా ప్రభాస్ 'కల్కి 2898 AD' సీక్వెల్ నుంచి దీపికాను తప్పిస్తున్నట్లు ప్రకటించింది. ఆమె సీక్వెల్‌లో భాగం కారంటూ వెల్లడించింది. వర్కింగ్ అవర్స్, కండీషన్స్ పెట్టడం వల్లే ఆమెను తప్పించారనే ప్రచారం సాగింది. దీనిపై అటు సోషల్ మీడియాలోనూ పెద్ద చర్చే జరిగింది. తాజాగా వర్కింగ్ అవర్స్‌పై దీపికా రియాక్ట్ అయ్యారు. వర్కింగ్ అవర్స్, కండీషన్స్ వల్లే ఆమెను తప్పించినట్లు వార్తలు వచ్చాయి. అగ్ర హీరోలు ఎన్నో ఏళ్లుగా 8 గంటలు మాత్రమే పని చేస్తున్నారని... ఇదేమీ రహస్యం కాదని అన్నారు దీపికా పదుకోన్. 'ఓ ఆత్మాభిమానం ఉన్న నటిగా నన్ను ఇబ్బంది పెట్టే వారిని నేను అంగీకరించనని తేల్చి చెప్పారు. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో చాలా మంది సూపర్ స్టార్స్, అగ్ర హీరోలు ఎన్నో ఏళ్లుగా 8 గంటలు మాత్రమే పని చేస్తున్నారు. ఇదేమీ రహస్యం కాదు. అయితే, ఇన్నేళ్లలో ఈ విషయం ఎప్పుడూ వార్తల్లో నిలవలేదు. ఇప్పుడు వాళ్ల పేర్లు చెబితే మొత్తం విషయం తప్పుదోవ పడుతుంది.అందుకే వారి పేర్లు చెప్పాలనుకోవడం లేదు. కానీ, చాలా మంది హీరోలు 8 గంటలే పని చేస్తారని అందరికీ తెలిసిన విషయమే. అంతేకాదు... వారిలో చాలామంది సోమవారం నుంచి శుక్రవారం వరకూ మాత్రమే షూటింగ్‌ల్లో పాల్గొంటారు. వీకెండ్స్‌లో పని చేయరు.' అని తెలిపారు.సైలెంట్‌గా యుద్ధాలు చేయడం మాత్రమే నాకు తెలుసు. అలా చేస్తేను అది గౌరవం, హుందాగా ఉంటుంది.' అంటూ చెప్పారు.

## కొత్త రకం మోసం.. రికార్డుల్లో కుబేరులు..

జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 12

మోసపోతున్న వారు ఉంటే.. మోసం చేసే వారి సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. ఇటీవల సైబర్ నేరగాళ్లు ఎలాగైనా ఇతరుల సొమ్ము కాజేయాలనే ఉద్దేశంతో వివిధ రకాల పన్నాగాలు వేస్తున్నారు. అందులో కొన్ని విజయవంతం అవుతాయి.. మరికొన్ని ఫెయిల్ అవుతాయి. అయితే ఇక్కడ వీటికి విభిన్నంగా డబ్బులను దోచుకునే ప్లాన్ వేశారు. ఎవరికీ అనుమానం రాకుండా.. కేంద్ర ప్రభుత్వాన్నే మోసం చేసే రేంజ్ కు వెళ్లిపోయారు. ఇంతకు ఏం జరిగింది..? వాళ్లు చేస్తున్న పని ఏంటి..?హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో కొత్త రకం మోసం వెలుగుచూస్తోంది. ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారులు, అడ్డా కూలీలు వంటి సామాన్య ప్రజలను కొందరు కేటుగాళ్లు తమ అక్రమ లావాదేవీలకు వాడుకుంటున్నారు. వీరికి తెలియకుండానే.. ఈ అమాయక ప్రజలు ఒక్కసారిగా రికార్డుల్లోకి కుబేరులుగా మారిపోతున్నారు. వీరి పేర్ల మీద బోగస్ కంపెనీలు సృష్టించి.. కోట్ల రూపాయల టర్నోవర్ జరిగినట్టు లెక్కలు చూపిస్తున్నారు. అసలు విషయం ఏమిటంటే.. ఈ మోసగాళ్లు పన్నులు ఎగ్గొట్టడానికి, జీఎస్టీ నుంచి ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ సబ్సిడీని అక్రమంగా పొందడానికి ఈ సామాన్యులను పావులుగా ఉపయోగిస్తున్నారు.ఈ మోసాలు ఎలా జరుగుతున్నాయంటే.. మోసగాళ్లు ముందుగా సామాన్యుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారు.

వ్యక్తిగత లోన్, హౌస్ లోన్లు బ్యాంక్ నుంచి ఇప్పిస్తామని..స్వచ్ఛంద సంస్థల నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తామని నమ్మబలుకుతారు. దీని కోసం ఆ ఆటో డ్రైవర్లు, టీ కొట్టు నిర్వాహకులు, అడ్డా కూలీలు.. తమ ఆధార్, పాన్ కార్డు, ఓటర్ ఐడీల జిరాక్స్ కాపీలను ఇస్తారు. కీలకమైన విషయం ఏమిటంటే.. కేవలం ఆధార్ కార్డు ఆధారంగానే జీఎస్టీ టిన్ నంబర్‌ను పొందే వెసులుబాటును ఈ కేటుగాళ్లు తమ నేరాలకు తెలివిగా వాడుకుంటున్నారు. ఆ పత్రాలను ఉపయోగించి బోగస్ సంస్థల పేరిట జీఎస్టీ రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. ఆ టిన్ నంబర్ల ద్వారా అసలు జరగని వ్యాపార లావాదేవీలు జరిగినట్లు నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి, వాటిని అడ్డుపెట్టుకుని కోట్ల రూపాయల ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ సబ్సిడీని దొంగిలిస్తున్నారు.ఈ మోసపోయిన అమాయకులకు తాము చేసిన వ్యాపారం గురించి గానీ.. కోట్ల టర్నోవర్ గురించి గానీ అసలు తెలియదు. ఎప్పుడైతే జీఎస్టీ అధికారులు ఇంటికొచ్చి.. వారి పేరిట వందల కోట్ల లావాదేవీలు జరిగాయని నోటీసులు ఇస్తారో.. అప్పుడే వారు ఉలిక్కిపడి తాము మోసపోయినట్లు తెలుసుకుంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో రుణం కోసం ప్రయత్నించిన ఒక ఆటో డ్రైవర్‌కు ఇలాగే రూ. 100 కోట్ల టర్నోవర్‌పై జీఎస్టీ నోటీస్ వచ్చింది. దీంతో తినడానికే సరిగ్గా తిండి లేక.. ఉండటానికి ఇల్లు లేని తమ జీవితం దుర్భరంగా ఉంటే.. ఇంత డబ్బు ఎక్కడి నుంచి వస్తుందని వారు బాధపడి, ఆ నోటీసులకు ఏం సమాధానం చెప్పాలో తెలియక పోలీసులు, లాయర్ల చుట్టూ తిరుగుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఈ ఏడాది 12 నుంచి 15 వరకు ఇలాంటి కేసులు నమోదయ్యాయి. ఇందులో కొన్ని ట్రేడింగ్ కంపెనీలు ఏపీ, మహారాష్ట్రల వ్యాపారులకు ముడి ఇనుము సరఫరా చేసినట్లు లెక్కలు చూపించి.. నకిలీ బిల్లులతో ఏకంగా రూ. 33 కోట్ల ITC పొందారు.

అందుకే పోలీసులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. మీరు ఈ మోసగాళ్ల బారిన పడకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అందులో.. మీ ఆధార్, పాన్ వంటి ముఖ్యమైన పత్రాలను ఎవరికీ ఇవ్వకూడదు. రుణం తీసుకోవాలంటే నేరుగా బ్యాంకులను మాత్రమే సంప్రదించండి. ఏదైనా కంపెనీలో ఉద్యోగానికి లేదా మరేదైనా అవసరానికి మీ ఐడీ పత్రాలు అడిగితే.. ఆ సంస్థకు సరైన చిరునామా, ఫిజికల్ ఆఫీస్ ఉన్నాయా లేదా అని పరిశీలించండి. ఆన్‌లైన్‌లో కంపెనీ వివరాలు కనిపించకపోతే అది బోగస్ అయ్యే అవకాశం ఉంది. జీతం ఇవ్వడానికి ముందు డబ్బు కట్టమని అడగడం, లేదా అధిక ధర కలిగిన వస్తువులు కొని తిరిగి పంపమని అడగడం వంటివి జరిగితే అది మోసమే అని గుర్తించండి.

# శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయానికి పోటెత్తుతున్న భక్తులు

**జయభేరి, యాదగిరిగుట్ట, అక్టోబర్ 12:**

తెలంగాణ ప్రసిద్ధ క్షేత్రం శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోకంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసియాహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం నిత్యకల్యాణం నిత్య బ్రహ్మోత్సవం వెండి జోడి సేవ స్వర్ణపుష్పార్చన, శ్రీసత్య నారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి, అమ్మవార్ల శ్రీఘ్రదర్శనం 4 గంటలు, అతిశీఘ్రదర్శనం 3 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. యాదగిరి కొండపైన దర్శన క్యూలైన్లతో పాటు ప్రసాదం విక్రయ కేంద్రం శివాలయం, పలు కూడళ్లలో భక్తుల సందడి నెలకొంది. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారితో పాటు కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**


శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా ఆదివారం రూ.49,68,644 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.2,14,850, బ్రేక్ దర్శనం ద్వారా రూ.3,69,100, వీఐపీ దర్శనం ద్వారా రూ.9,00,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.6,34,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,23,400, ప్రసాద విక్రయం ద్వారా రూ.18,21,000, కల్యాణకట్ట ద్వారా రూ.1,31,000తో పాటు వివిధ శాఖ,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ చెందిన ఉత్తర సెంటర్ ఫర్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ వారిచే భరత నట్య ప్రదర్శనతో పాటు పలు సాంస్కృతి కార్యక్రమాలు భక్తులను అలరించాయి.





## అభినయంతో అలరించిన చిన్నారి నృత్యం

**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 12 :**

అద్భుతమైన ఆహాభావాలతో అభినయంతో అలరించిన చిన్నారి నృత్యం వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. దేవీ నవరాత్రుల సందర్భంగా మహతి ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సంగీత నృత్య నిరాజనం, హైదరాబాద్ నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం లో ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ నృత్య ప్రదర్శనలో షాద్ నగర్ పట్టణానికి చెందిన ప్రభోదయ డాన్స్ & మ్యూజిక్ గురువు రంజు ప్రవీణ శిష్యురాలు అక్షయ చేరి యశోద కు శిశువితాడు గానంపై ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, అభినయ ఆహాభావాలతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అదేవిధంగా చిన్నారులు సిద్ధి వినాయక, పుష్పాంజలి, రామ రామ, ముద్దుగారే యశోద గానాలపై హితిక, మోక్ష, ఉషశ్రీ, ధృవిక, నిఖిత ఇచ్చిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అభిమానులను ఎంతగానో అలరించాలి. చిన్నతనం నుంచి నృత్య కలపై ఆసక్తి కలపరుస్తూ ఉన్న చిన్నారులను అభినందిస్తూ ప్రముఖ నాట్య గురువు సజని వల్లభనేని చేతుల మీదుగా మెమొంటోలు, ప్రశంస పత్రాలు అందుకున్నారు.

## ప్రజల అవస్థలు అధికారులకు పట్టదా?

- పసి పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న అధికారులు...
- దంపింగ్ యార్డుని తలపిస్తున్న క్రీడా మైదానం...
- దోమల దండయాత్ర తో అవస్థలు పడుతున్న ప్రజలు...



**జయభేరి, గార్ల, అక్టోబర్ 12 :**

మండల పరిధిలోని చిన్నకిష్టాపురం గ్రామపంచాయతీలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన క్రీడామైదానం క్రీడాకారులకు అసౌకర్యంగా మారిపోయి దంపింగ్ యార్డును తలపిస్తుంది.క్రీడా మైదానం అతి సమీపంలోనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రం, గ్రామపంచాయతీ కార్యాలయం ఉండటంతో చెత్త పేరుకుపోయి,దానిని కాల్చడం వల్ల వచ్చే పొగతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయి.పసి పిల్లల ప్రాణాలతో ప్రభుత్వ అధికారులు చెలగాటమాడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమల దండయాత్ర తో ప్రజలు అవస్థలు పడుతున్న పాలకులకు గానీ, అధికారులకు గానీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో శుభకార్యాలు జరిగినప్పుడు అక్కడ తిని పడేసిన వ్యర్థాలను, ఇంట్లో చెత్త, ఖాళీ సీసాలు అన్నింటిని మూట కట్టుకొని క్రీడా మైదానంలో పడేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు తక్షణమే దృష్టి సారించి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎవ్వరిని అడిగినా బీఆర్ఎస్సే బాగుండే..

- కాంగ్రెస్ బేకార్ గా ఉన్నది..
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- కారు గుర్తుకే ఓటేస్తాం..

**జయభేరి, ఎల్లారెడ్డి గూడ :**



మాగంటి సునీతని గెలిపిస్తాం అని ప్రజలందరూ అంటున్నారు అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్లారెడ్డి గూడలో ఇంటింటా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. 22 నెలల్లో ₹2.8 లక్షల కోట్ల అప్పులు చేసి, కనీసం ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం.. నెలల తరబడి జీతాలు చెల్లించకుండా చిన్న ఉద్యోగులను వేధించడం రేవంత్ అసమర్థ పాలనకు నిదర్శనం అని హైడ్రాను తెచ్చి పేద ప్రజల ఇండ్లను కూలుస్తున్నారు, వాళ్ల జీవితాలను రోడ్లపాలు చేస్తున్నారు. పేదలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మేం ఎందుకు ఓటు వేస్తాం అని ప్రజలు అంటున్నారు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల చూపంతా గులాబీ పార్టీ వైపే

- ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితి లేదు!
- కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు
- ఉమ్మడి మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి
- విస్తృతంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారం ప్రారంభం
- ప్రచారంలో పాల్గొన మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి

**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 12 :**



రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ గులాబీ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని ఎదురు చూస్తున్నారని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ లో జరగనున్న ఉపఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దివంగత నేత మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సునీత గెలుపు కోసం జూబ్లీహిల్స్ లోని ఎల్లారెడ్డి గూడా కాలనీలలో ఉన్న ప్రజల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ; ప్రజలందరూ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు.అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఉప ఎన్నికల్లో ఓటమి తప్పదని ప్రజలు కచ్చితంగా కాంగ్రెస్ పార్టీనీ గద్దె దింపుతారని, ఎటు చూసినా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుందని అన్నారు. జూబ్లీహిల్స్ లో ప్రజల నుండి బీఆర్ఎస్ పార్టీకి మాగంటి సునీత మంచి స్పందన వస్తుందని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగి పోయారని, కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు.కచ్చితంగా బిఆర్ఎస్ పార్టీ విజయం సాధించబోతుందని ఆశాభావం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి .ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కమలం కామ్

**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 12ఛ**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక షెడ్యూల్ వచ్చింది. ఈ నెల 13న నోటిఫికేషన్ వెలువడుతుంది. కానీ.. బీజేపీ ఇంకా తన అభ్యర్థిని ప్రకటించలేదు. అసలా విషయంలో ఒక క్లారిటీ ఉందో లేదో కూడా బయటికి తెలియడం లేదు. అభ్యర్థి ఎంపిక కోసం ముగ్గురు నాయకులతో కమిటీ వేసి అభిప్రాయ సేకరణ కూడా చేసింది పార్టీ రాష్ట్ర నాయకత్వం. ఈ క్రమంలో... త్వరలోనే ముగ్గురు పేర్లతో రాష్ట్ర ఎన్నికల కమిటీ కేంద్ర పార్టీకి లిస్ట్ పంపబోతోందట. మరోవైపు ఈసారి పార్టీ టిక్కెట్ ఆశిస్తున్న వాళ్ళ లిస్ట్ చాంతాడంత ఉంది. ఇక్కడ విశేషం ఏంటంటే.. జూబ్లీహిల్స్ కమలం టిక్కెట్ ఆశిస్తున్న వారిలో పురుషుల కన్నా మహిళలే ఎక్కువగా ఉన్నారు. వాళ్ళలో కొందరైతే గట్టిగానే ప్రయత్నాలు చేసుకుంటున్నట్టు సమాచారం. ప్రస్తుతం రేస్‌లో అరడజన్‌కు పైగా మహిళా నేతల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. గత ఎన్నికల్లో టికెట్ ఆశించిన జూటూరు కీర్తి రెడ్డి ఈసారి నాకో ఛాన్స్ అంటున్నారట. అందుకు తగ్గట్టే.. ఆమె నియోజకవర్గంలో ఎప్పటి నుంచో తిరుగుతున్నారు కూడా. బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ వీరపనేని పద్మ కూడా సీటు ట్రయల్స్‌లో ఉన్నారు. తనకు సామాజికవర్గం కలిసి వస్తుందని నమ్మకంగా ఉన్నారట ఆమె. ఇక మరో మహిళా నేత ఆకుల విజయ కూడా టికెట్ కోసం గట్టి ప్రయత్నాలే చేసుకుంటున్నట్టు సమాచారం. పార్టీకి చెందిన కొందరు పెద్ద నేతలతో కూడా రికమండ్ చేయించుకుంటున్నారట ఆమె. ఆ నేతలు అభిప్రాయ సేకరణ కమిటీ ముందు తమ మనసులో మాట చెప్పేసినట్టు తెలుస్తోంది. ఇక గత లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి పోటీచేసి ఓడిపోయిన మాధవీలత కూడా టికెట్ రేస్‌లోకి వచ్చేశారట. ఆమె తనకున్న పరిచయాలతో ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నట్టు చెప్పుకుంటున్నాయి పార్టీ శ్రేణులు. రీసెంట్‌గా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును కలిశారు జయసుధ.



## పోలియో చుక్కలు వేయిద్దాం

- పోలియో రహిత సమాజాన్ని స్థాపిద్దాం
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- పోలియో చుక్కలు వేయిద్దాం

**జయభేరి, ఉప్పల్ :**

పోలియో రహిత సమాజాన్ని స్థాపిద్దాం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఉప్పల్ PHC లో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. 05 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయిద్దాం అని పోలియోరహిత సమాజాన్ని నిర్మిద్దాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చిలుక నగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, PHC అధికారులు ఆశా వర్కర్లు BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బైండ్ల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాణాప్రతాప్



**జయభేరి, యాదగిరిగుట్ట, అక్టోబర్ 12:**

బైండ్ల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా యాదగిరిగుట్ట మండల పరిధిలోని వంగపల్లి గ్రామానికి చెందిన ఒగ్గు రాణా ప్రతాప్ నియామకమయ్యారు. ఆదివారం హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో బైండ్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిళ్ల లక్ష్మణరావు చేతుల నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నాగిళ్ల లక్ష్మణరావు మాట్లాడుతూ బైండ్ల సంక్షేమానికి రూ.200 కోట్లు ప్రవేశపెట్టి ఆదుకోవాలని, ప్రత్యేక బైండ్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బైండ్ల కులస్తులకు రాజకీయ అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో అవకాశాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఒగ్గు రాణా ప్రతాప్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బైండ్ల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు చిన్నాక మల్లేశం, ఎస్పీ స్వామి,ఎల్లమ్మ,కంటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుల హక్కుల కోసం పోరాడుతాం



**జయభేరి, యాదగిరిగుట్ట అక్టోబర్ 12:**

కల్లు గీత వృత్తికి అండగా నిలిచిన కంఠమహేశ్వరుడి స్ఫూర్తితో గీత కార్మికుల హక్కుల కోసం పోరాడుతామని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేక పోతుల వెంకటరమణ అన్నారు. ఆదివారం యాదగిరిగుట్టలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, ప్రమాద నివారణ కోసం ఇస్తున్న కాటమయ్య రక్షణ కవచం పథకం నత్త నడకన నడుస్తుందన్నారు. గీత వృత్తి చేసేవారందరికీ కాటమయ్య కిట్లు ఇవ్వాలని, పెండింగ్ ఎక్స్ గ్రేషియా డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గీత వృత్తిలో ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈనెల 28న చౌటుప్పల్ జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని గుండ్లపల్లి, యాదగిరిపల్లి గ్రామ సొసైటీల అధ్యక్షులు, సభ్యులను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు, వి.వెంకట నర్సయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎరుకల సుధా హేమేందర్ గౌడ్,యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు కోల వెంకటేష్,గౌడ్,గుండ్లపల్లి సొసైటీ అధ్యక్షుడు గంధమల్ల ఉపేందర్ గౌడ్,యాదగిరిపల్లి సొసైటీ అధ్యక్షుడు సీసా కృష్ణగౌడ్,తుర్కపల్లి మండల అధ్యక్షుడు మారగోని శ్రీరామమూర్తి,నాయకులు మచ్చ నర్సింహ్మా, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బాకీ కార్డును ప్రజలకు వివరిస్తున్న మాజీ శాసనసభ్యులు



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలంలోని గొడుకొండ్ల మాల్ వెంకటేశ్వర నగర్ లో కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేసిన బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, జిల్లా నాయకులు బిల్యా నాయక్, మండల పార్టీ అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ నాయకులు, విద్యాసాగర్ రావు, కొండూరు శ్రీనివాస్, బాదేపల్లి పులిరాజ్, మల్లోజు జగన్,నిరంజన్, జిట్టే జగన్, వెంకటయ్య, శ్రీను, రామకృష్ణ, పల్లేటి కృష్ణ, అబ్బయ్య, ఈదయ్య, శంకర్, పడకండి రవి, పరమేష్, నరేష్, శివ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గణపురం గ్రామంలో BRS పార్టీలో చేరికలు



జయభేరి, గుడిపల్లి :

గుడిపల్లి మండలం గణపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తోటకూరి పరమేష్, కటికనేని మాధవ రావు, కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి, కస్తూరి యాదగిరి, అదంకి దానబాబు, మైనం లింగయ్య, నాయిని రాఘవేంద్ర రావు,తోపాటు 150 కుటుంబాలు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు. బీఆర్ఎస్ లో చేరిన నాయకులకు గులాబీ కండువాలను కప్పి మాజీ శాసనసభ్యులు రవీంద్ర కుమార్ తమ పార్టీ లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.....వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను గెలిపించాలి ఆయన కోరారు.బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ హయాంలో ప్రవేశపెట్టిన అనేక ప్రజా సంక్షేమ పథకాలు యావత్ దేశానికి దిక్సూచిగా మారాయని అన్నారు. కేసీఆర్ తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పునరుద్ఘాటించారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు అయిందన్నారు.బీఆర్ఎస్ లో చేరిన ప్రతీ కార్యకర్త కుటుంబానికి గులాబీ పార్టీ అండగా నిలుస్తున్నదని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలక సభ్యత్వం పొంది మృతిచెందిన కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షలు అందజేస్తున్నామని అన్నారు. సభ్యత్వాల నమోదులో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో బీఆర్ఎస్ పార్టీ ఉన్నదని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలు, పట్టణాల రూపురేఖలు మారిపోయాయని అన్నారు. ప్రతీ గ్రామంలో పల్లె ప్రకృతి వనం, వైకుంఠ ధామం,డంపింగ్ యార్డు, రైతు వేదికలను కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిందని అన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం అధిక మొత్తంలో నిధులు మంజూరు చేసిందని అన్నారు.

కేసీఆర్ దూరదృష్టి ఫలితంగా గ్రామాల్లో అడుగంటిన చెరువులన్నీ ప్రస్తుతం జలకళతో దర్శనమిస్తున్నాయని అన్నారు. అనేక మారుమూల గ్రామాల్లోనూ ఇంటింటికీ మిషన్ భగీరథ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగు నీరు అందుతున్నదని అన్నారు. రైతులకు పంట పెట్టుబడిసాయం చేయాలనే ధృఢ సంకల్పంతో రైతు బంధు, రైతు బీమా వంటి చారిత్రాత్మక పథకాలను కేసీఆర్ రూపకల్పన చేశారని అన్నారు. ఈ రెండు పథకాలు దేశానికే దిక్సూచిగా మారాయని అన్నారు. పేదింటి ఆడపిల్లల పెండ్లి కోసం కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల ద్వారా రూ.1,00,116 మేనమామ కట్నంగా కేసీఆర్ సర్కార్ అందజేసిందని చెప్పారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యంగులు, వృద్ధులకు, బీడీ కార్మికులకు ప్రభుత్వం పెన్షన్ అందజేసిందని అన్నారు. దశాబ్దాల భూవివాధాలను తెరదించి భూయజమానులకు హక్కులు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ధరణీ పోర్టల్ ను రూపొందించిందని అన్నారు. నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పించిందని అన్నారు. దేవరకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేశామని అన్నారు. రానున్న రోజుల్లో ఇతర పార్టీల నుంచి కూడా బీఆర్ఎస్ లోకి భారీగా వలసలు ఉంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వెల్లుగూరి వల్లపు రెడ్డి, మునగాల అంజి రెడ్డి, అర్వపల్లి నర్సింహ, నిమ్మల విష్ణువర్ధన్ రెడ్డి, మద సుధాకర్ గౌడ్, బొడ్డుపల్లి మహేందర్, రైనబోయిన శ్రీను, దూదిపాల విష్ణువర్ధన్ రెడ్డి, గోలి గిరి, ఎర్ర యాదగిరి, సత్తయ్య, రాంబాబు, లాజర్, అనిల్, వంశీ తదితరులు అన్నారు.



## నిరంతరంగా 100 భజన పాటలు

- సత్యసాయి 100వ జన్మదినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం

జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 12:

తుర్కపల్లి మండలం వీరారెడ్డి పల్లి గ్రామంలో ఆదివారం ఉన్నత పాఠశాల ఆవరణలో పుట్టపర్తి సత్యసాయి 100వ జన్మదిన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సత్యసాయి 100వ జన్మదినం పురస్కరించుకొని జిల్లాలోని అన్ని సమితులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరంగా 100 భజన పాటలు పాడి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు చిన్నారులకు బహుమతులు అందజేశారు. సత్యసాయి చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి పూలు జల్లి పూలమాలలు వేసి జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని అన్ని సమితులు బాధ్యులు డివోటీస్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు లక్ష్మయ్య, సోమ కృష్ణమూర్తి, సత్యనారాయణ, రామ చంద్రం, జడల ప్రవీణ్, సకినాల శ్రీనివాసులు, బిర్రు బాలకిషన్, పుసునాల సాయి తదితరులు ఉన్నారు. కార్యక్రమం సందర్భంగా నారాయణ సేవ నిర్వహించారు.

## రెండు పోలియో చుక్కలు జీవితానికి సురక్ష

- షాద్ నగర్ లో పల్స్ పోలియో పోలియో కార్యక్రమం
- చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డా.విజయలక్ష్మి



జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 12 :

రెండు పోలియో చుక్కలతో నిండు జీవితం సురక్షితం అని చిన్నపిల్లల జీవితం అంగవైకల్యాన్ని నివారణ, చిన్నారి బాలలు పూర్తిగా రక్షింపబడాలంటే రెండు పోలియో చుక్కలు వారికి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం పురస్కరించుకొని షాద్ నగర్ బస్టాండ్లో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వి.విజయలక్ష్మి ఆదేశానుసారం డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సబ్ నేషనల్ డే పల్స్ పోలియో కార్యక్రమంకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ 5 సంవత్సరాల లోపు పిల్లలకి పోలియో చుక్కలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ; చిన్నపిల్లలకు పోలియో చుక్కలు వేయడం వలన అంగవైకల్యం అనారోగ్యం వంటి సమస్యలను పూర్తిస్థాయిలో నివారించవచ్చని ఉన్నారు. ఐదు సంవత్సరాల లోపు ప్రతి ఒక్క చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం ఎట్టి పరిస్థితిలో తల్లిదండ్రులు మరువద్దని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో చుక్కల వలన వారి నిండు జీవితం ఎల్లప్పుడూ సుఖవంతంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైద్యులు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## తుర్కపల్లి కుమ్మర సంఘం అధ్యక్షునిగా రాములు ఏకగ్రీవ ఎన్నిక



జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 12:

తుర్కపల్లి మండల కేంద్రంలో ఆదివారం కుమ్మర సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు తుర్కపల్లి గ్రామ కమిటీ అధ్యక్షునిగా జివిలికపల్లి రాములు, ఉపాధ్యక్షులుగా బాలరాజు, గంగాధరి నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, సహాయ కార్యదర్శిగా గోపాల్ ,ప్రచార కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా జివిలికపల్లి మహేష్, గ్రామ యూత్ అధ్యక్షునిగా గంగదారి పవన్ ,గౌరవ అధ్యక్షులుగా శ్రీనివాస్, బాలనర్సయ్య, గంగదారి నర్సింలు, గౌరవ సలహాదారులుగా సత్తయ్య, బాల నరసయ్య, రాములు ,నర్సింలు, కార్యవర్గ సభ్యులు గా నాగరాజు, శ్రవణ్, వినయ్ ,చంద్రకాంత్, శివ, మణికంఠ, రాము లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవరుప్పల మల్లేష్, నియోజకవర్గ కన్వీనర్ జివిలికపల్లి ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి నాగాయపల్లి శివరాములు, కోశాధికారి జాగిల్లపురం సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి కొలనుపాక కొండల్, మీడియా కోఆర్డినేటర్ మహేష్ ,యూత్ అధ్యక్షుడు తిగుళ్ల బాలకృష్ణ, మండల యూత్ ప్రధాన కార్యదర్శి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అర్టిసి ఎండి ని సన్మానించిన ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు



జయభేరి, పరకాల, అక్టోబర్ 12:

ఆదివారం టీజిఎస్ అర్టీసి ఎండి నాగిరెడ్డి హనుమకొండ ఆర్ఎం కార్యాలయంకు వచ్చిన సందర్భంగా పరకాల డిపో ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీ డిపో ప్రెసిడెంట్ గోవర్ధన్ నాయక్, డిపో సెక్రటరీ ప్రసాద్, పూల మొక్కని బహుకరించి, శాలువతో ఘనంగా సన్మానించినారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ప్రెసిడెంట్ దేవేందర్, రీజినల్ సెక్రటరీ కే నాగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్ ఎస్ కుమార్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కార్మికుల సమస్యలపై మెమోరండం ఎండి కి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జోనల్ నాయకులు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రామికులే సంపద సృష్టికర్తలు

- కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- విశ్వ జంపాల, విశ్వ సమాజం వ్యవస్థాపకులు



జయభేరి, గార్ల, అక్టోబర్ 12:

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, కార్మికుల పొట్ట కొట్టి కార్పొరేట్ శక్తులకు దారపోస్తున్నాయని విశ్వ సమాజం వ్యవస్థాపకులు, ప్రముఖ న్యాయవాది విశ్వ జంపాల అన్నారు.సమాజ నిర్మాణం కోసం అడుగడుగున రక్త మాంసాలు ధారపోస్తున్న శ్రామికులే సంపద సృష్టికర్తలని అన్నారు.ఆదివారం సుద్దాల నాగరాజు అధ్యక్షతన తెలంగాణ ప్రజాస్వామిక కార్మిక సంఘం ఆవిర్భావ సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ... కాకులను కొట్టి, గద్దలకు పంచినట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కడుపు కొట్టి కార్పోరేట్ సంస్థలకు దోచిపెడుతూ కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయనీ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శ్రామికులంతా ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికులు పోరాడి సాధించుకొన్న కార్మిక చట్టాలను,హక్కులను తుంగలో తొక్కి బిజెపి ఆధ్వర్యంలోనీ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మికులను మరింత అణిచివేతకు, దోపిడీకి గురి చేసే ప్రయత్నానికి పూనుకుంటుందన్నారు.కార్మికులకు శ్రమకు తగ్గ న్యాయమైన వేతనం, సురక్షిత పని వాతావరణం,సామాజిక ఆత్మ గౌరవం కోసం చికాగో అమరవీరుల స్ఫూర్తితో, కార్మికులు, కర్షకులు సమరశీల సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలనీ ఆయన పిలుపునిచ్చారు. హిందుత్వం ముసుగులో బిజెపి ప్రజల మధ్య మతపరమైన ఘర్షణలు సృష్టిస్తూ అధికారాన్ని కాపాడుకోవడానికి తీవ్ర ప్రయత్నం చేస్తుందని విమర్శించారు.ఎస్సీ,ఎస్టీ,బీసీ బడుగు బలహీన వర్గాలను హిందుత్వం రొంపిలోకి దించుతూ మతపరమైన మానసిక ఉన్మాదులను తయారు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకులు జి.నరేందర్, మూలుగురి యాక్కయ్య,గజ్జ చందు,మాదరాజు యాకన్న, మూల ప్రభాకర్ గౌడ్, మొరుగడి అశోక్ గౌడ్, చిట్యాల శ్వేత, సుద్దగాని శ్రీలత, రచ్చ రాం నర్సయ్య, గొల్లపెల్లి వెంకన్న గౌడ్, తూటిపరుశరములు, జినుక పవన్ కళ్యాణ్, సంఘి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.





## డాక్టర్లు, లాయర్లుతో జనసురాజ్ జాబితా

జయభేరి, పాట్నా, అక్టోబరు 12:

బిహార్ దంగల్ మొదలైంది. రెండు విడతల్లో నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు జరుగనున్నాయి. అధికార జేడీఎస్, బీజేపీ, ప్రతిపక్ష మహాఘట్ బంధన్(ఆర్జేడీ, కాంగ్రెస్ తదితరపార్టీలు) నువ్వా నేనా అన్నట్లు పోటీకి సిద్ధమవుతున్నాయి. ఓపీనియన్ పోల్స్ ఇరు పార్టీల మధ్య గట్టి పోటీ ఉంటుందని తెలిపాయి. ఈ నేపథ్యంలో పీకే (ప్రశాంత్ కిశోర్) పార్టీ జన్ సురాజ్ కీలకం కాబోతోంది. 10 శాతం ఓట్లు పొందే అవకాశం ఉందని ఒపీనియన్ పోల్స్ తెలిపాయి. ఈ నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ బలమైన అభ్యర్థులను బరిలో దించుతున్నారు.2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం జాతీయ స్థాయిలో ప్రధాన పార్టీల మధ్య సీట్ల పంచాయితీపై ఇంకా తుది ఒప్పందం కుదరలేదు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ, కాంగ్రెస్ నాయకత్వంలోని మహా ఘట్ బంధన్ కూటముల్లో సీట్ల పంపిణీని చర్చిస్తూ తీవ్ర సమరసతలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా, చిరాగ్ పాశ్వాన్ నాయకత్వంలోని ఎల్.జె.పీ, జితన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హెచ్.ఏఎం పార్టీల డిమాండ్లు బీజేపీతో చర్చలను క్లిష్టతరం చేశారు. మహా ఘట్ బంధన్‌లోనూ ఇదే పరిస్థితి.

**జన్ సురాజ్ పార్టీ కొత్త దిశ**


- ప్రశాంత్ కిశోర్ ఏర్పాటు చేసిన జన్ సురాజ్ పార్టీ తొలి జాబితాలో బీసీలు, మైనారిటీ వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చింది. 16% ముస్లింలు, 17% అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన అభ్యర్థుల్లతో, పార్టీ క్లీన్ ఇమేజ్, అవినీతినేని పోరాట శాంప్రదాయాన్ని ఆకర్షిస్తోంది. విద్యావేత్తలు, మాజీ అధికారులు పార్టీలో పోటీ చేసి సామాజిక న్యాయార్థం ప్రతిబింబించే ప్రయత్నం చూపించారు.

**ప్రముఖ అభ్యర్థులు**

- కేసీ.సిన్హా: ప్రముఖ గణిత శాస్త్రవేత్త, పట్నా విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ (సీనియర్ విద్యా నిపుణుడు)
- వైబీ.గిరి: పట్నా హైకోర్టు సీనియర్ న్యాయవాది, భారత అదనపు సొలిసిటర్ జనరల్
- డాక్టర్ అమిత్ కుమార్ దాస్: పట్నా మెడికల్ కాలేజ్ పూర్వ విద్యార్థి, గ్రామీణ ఆరోగ్య సేవా కార్యక్రమ కారులు
- జన్ సురాజ్ పార్టీలో ఆయన వర్గీయ పోటీపై ప్రశాంత్ కిశోర్ సొంతంగా పోటీ చేయబోతాడా అని ఉత్కంఠ నెలకొంది. రాఘోపూర్, తేజస్వి యాదవ్ స్థలాలపై ఆయన పోటీ చేయవచ్చు అనే అంచనాలు ఉన్నాయి. కర్గహర్ నుంచి ఆయన బలమైన అభ్యర్థి రితేష్ రంజన్ (పాండే) పోటీ చేస్తోందని తెలుస్తోంది.
- ప్రధాన పార్టీల మధ్య సీట్ల పంచాయితీ ఒప్పందం తేలికపాటే కాదని నిపుణులు చెప్తున్నారు
- జన్ సురాజ్ పార్టీలో క్లీన్ ఇమేజ్ ఉన్న అభ్యర్థుల పోటీ ప్రజల ఆసక్తిని పెంచుతోంది
- మైనారిటీ, బీసీ వోటర్ల మద్దతు శ్రేణి వైపు తెలంగాణ రాజకీయాలు కీలక ఫలితాన్ని ఖరారుచేస్తున్నాయిఈ ఎన్నికల విషయంలో సీట్ల పంచాయితీ, అభ్యర్థుల వ్యక్తిగత ప్రాధాన్యత, మైనారిటీ ఓట్ల ప్రాదాన్యం తదితర అంశాల మేళవింపు ఫలితాలకు మునుపటిలా ఆసక్తిని పెంచుతోంది.

# ఘనంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పథసంచలన్

- పూల వర్షం కురిపించిన ప్రజలు
- శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా షాద్‌నగర్ లో భారీ ప్రదర్శన



జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 12 :

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా షాద్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పథసంచలన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో జరిగిన ఈ భారీ ప్రదర్శనలో స్వయంసేవకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జగన్నాథ్ బస్తీ, శివ మారుతి బస్తీ పరిధిలోని కార్యకర్తలు 7వ వార్డులోని ఆనంద్ నగర్ కాలనీ పార్క్ నుండి సంచలనాన్ని మొదలు పెట్టారు. ప్రజలు కవితూచేస్తున్న వారికి పూల వర్షం కురిపించారు. ఇరువైపుల నుండి వచ్చిన కార్యకర్తలు షాద్‌నగర్ పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద ఏకమై, అక్కడి నుండి ప్రధాన వీధి, పాత జాతీయ రహదారి, ముఖ్య కూడలి అయిన పరిగి రోడ్డు మీదుగా క్రమశిక్షణతో ప్రదర్శన నిర్వహించారు. ఈ పదసంచలన్ పరిగి రోడ్డులోని మల్లికార్జున కాలనీ పార్క్ వరకు కొనసాగింది. పథసంచలన్ సందర్భంగా కాలనీల వీధుల్లో వెళుతున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై స్థానికులు, ప్రజలు పలుచోట్ల పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. సంచలన్ అనంతరం మల్లికార్జున కాలనీ పార్క్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో నగర ప్రముఖ్ నాగిళ్ల ప్రభాకర్ మాట్లాడుతూ... ఆర్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం, సంఘ్ శతాబ్ది ఉత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## స్కూళ్లలో ఏఐ కోర్సు

జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 12:

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సర్వాంతర్యామిగా పరిణమిస్తున్న క్రమంలో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే అన్ని రంగాల్లో ఏఐ రంగ ప్రవేశం చేసింది. ఇప్పుడు విద్యారంగంలోనూ పెను మార్పులకు తెరదించింది. ఈ క్రమంలో 202627 విద్యా సంవత్సరం నుంచి మూడో తరగతి నుంచే అన్ని పాఠశాలల కరిక్యులమ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ని ప్రవేశపెట్టాలని కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఇక అన్ని తరగతుల విద్యార్థుల కోసం ఏఐ ఇంటిగ్రేషన్ ఫ్రేమ్ వర్క్‌ను కేంద్రం అభివృద్ధి చేయనుంది. వచ్చే రెండు మూడేళ్లలో విద్యార్థులు, టీచర్లు సమన్వయం చేసుకునేలా వేగంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దేశవ్యాప్తంగా సుమారు కోటి మందికిపైగా టీచర్లకు ఏఐ టెక్నాలజీ విద్యపై దిశానిర్దేశం చేయడం సవాలుగా మారింది. అన్ని తరగతుల్లో AI ఏకీకరణకు సీబీఎస్ఈ ఫ్రేమ్ వర్క్‌ను అభివృద్ధి చేస్తోంది. పాఠ్య ప్రణాళికలను సిద్ధం చేయడానికి ఉపాధ్యాయులు AI టూల్స్ ఉపయోగించేందుకు ఒక పైలట్ ప్రాజెక్ట్ ఇప్పటికే చేపట్టాం. డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను సిద్ధం చేయడమే మా లక్ష్యమని కేంద్ర స్కూల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.ఇప్పటికే 18, 000 కి పైగా CBSE పాఠశాలలు 6వ తరగతి నుంచే 15 గంటల మాడ్యూల్‌లో AI ని స్కిల్ సబ్జెక్టుగా అందిస్తున్నాయి.



# పీపుల్ మీడియా ఫ్యాక్టరీ

## 'మోగ్లీ 2025' డిసెంబర్ 12న రిలీజ్

'బబుల్ గమ్' తో సక్సెస్ ని అందుకున్న హీరో రోషన్ కనకాల 'మోగ్లీ 2025'తో ప్రేక్షకులను అలరించబోతున్నాడు. జాతీయ అవార్డు గ్రహీత, దర్శకుడు సందీప్ రాజ్ (కలర్ ఫోటో) దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫారెస్ట్ నేపథ్యంలో సాగే యూనిక్ రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన 'మోగ్లీ 2025' ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. నిర్మాతలు సినిమా విడుదల తేదీని అనౌన్స్ చేశారు. 'మోగ్లీ 2025' డిసెంబర్ 12న థియేటర్లలోకి వస్తుంది. డిసెంబర్ రెండవ వారంలో ఎలాంటి పెద్ద సినిమాలు లేకపోవడం"మోగ్లీ 2025"కు పెద్ద ప్లస్ పాయింట్‌గా కానుంది. నాని వాయిస్ ఓవర్ ఇచ్చిన ఫస్ట్ గ్లింప్స్‌తో ఈ చిత్రం స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేసింది. ఈ వీడియో ప్రేక్షకులను ది వరల్డ్ ఆఫ్ మోగ్లీకి పరిచయం చేసింది. ఎమోషనల్ నెరేటివ్ లో రోషన్ కనకాల పవర్ ఫుల్ పాత్రను పోషిస్తున్నాడు. సాక్షి సాగర్ మడోల్కర్ హీరోయిన్. వారి అద్భుతమైన కెమిస్ట్రీ ఈ చిత్రంలో హైలెట్ గా ఉండబోతోంది. బండి సరోజ్ కుమార్ ఒక బలమైన విలన్ పాత్రను పోషిస్తుండగా, హర్ష చెముడు కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీని, కాల భైరవ సంగీతం అందిస్తున్నారు. స్క్రీన్ ప్లేను రామ మారుతి ఎం, రాధాకృష్ణ రెడ్డి రాశారు. కోదాటి పవన్ కళ్యాణ్ ఎడిటర్‌గా, కిరణ్ మామిడి ఆర్ట్ డైరెక్టర్‌గా, నటరాజ్ మాదిగొండ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ అందిస్తున్నారు. తారాగణం: రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్

# ఇతని బ్యాక్ గ్రౌండ్ ఏంటో?



నిఖిల్ నాయర్.. సినిమాలు చూసే వారిక పెద్దగా పరిచయం లేకపోవచ్చు కానీ.. సీరియల్స్ చూసే వారికి ఈ నటుడు బాగా పరిచయం. గృహలక్ష్మీ సీరియల్‌లో తులసి చిన్న కొడుకు ప్రేమ్‌గా నటించి బుల్లితెర ఆడియెన్స్ కు బాగా చేరువయ్యాడు నిఖిల్. ఆ తర్వాత 'పలుకే బంగారమాయెనా' సీరియల్‌లో హీరోగా అలరించాడు. ఇక 'దిల్ సే' ఓటీటీ సిరీస్‌తో నూ యూత్ లో మంచి క్రేజ్ తెచ్చుకున్నాడు. ఇప్పుడు ఆ క్రేజ్ , పాపులారిటీని డబుల్ చేసుకునేందుకు బిగ్ బాస్ 9 తెలుగులోకి ఎంట్రీ ఇచ్చాడీ ట్యాలెంటెడ్ యాక్టర్. ఈ సందర్భంగా బిగ్ బాస్ వేదికపైకి నిఖిల్ ను ఆహ్వానించి కొన్ని ప్రశ్నలు వేశారు హోస్ట్ నాగార్జున. దీనికి ఆసక్తికర సమాధానాలిచ్చాడీ బుల్లితెర హీరో. పుట్టింది కేరళలో సెటిలైంది బెంగళూరులో. సీరియల్స్ చేస్తుంది తెలుగులో. నా కెరీర్ ని ప్రారంభించింది ఇక్కడే కాబట్టి రుణం తీర్చుకుంటాను అని నిఖిల్ అనగానే.. మరి ఇక్కడమ్మాయిని పెళ్లి చేసుకుంటావా అని నాగ్ అడిగాడు.. దీనికి ఏ మాత్రం ఆలోచించకుండా కచ్చితంగా చేసుకుంటానని ఆన్సరిచ్చాడు నిఖిల్. ఇక ప్రస్తుతం హౌస్ లో ఇమ్మాన్యుయేల్ నచ్చాడనని చెప్పుకొచ్చాడు. ఈ సందర్భంగా నిఖిల్ కు పింక్ స్టోన్ ఇచ్చాడు. బిగ్ బాస్ హౌస్ లో కెప్టెన్సీ కోసం చాలా టాస్కులు జరుగుతుంటాయి. దీన్ని ఉపయోగించి కెప్టెన్సీ కంటెండర్ అయిపోవచ్చు అని నాగ్ నిఖిల్ కు చెప్పాడు.



# అది నడుమా... ఇంకేదైనా..


కన్నడ అందం నభా నటేష్ చీరలో నడుము ఒంపులు చూపిస్తూ మతి పోగొడుతోంది. డాన్ ఆఫ్ జాయ్ అంటూ ఈ ఫొటోలను తన ఇన్‌స్టాలో షేర్ చేసిన ఆమె.. చీరలో ఇంకా అందంగా కనిపించింది. చాలా రోజులుగా సిల్వర్ స్క్రీన్ కు దూరంగానే ఉన్నా తన ఇన్‌స్టా అకౌంట్లో ఫొటోలతో అభిమానులకు దగ్గరవుతూనే ఉంటుంది నభా నటేష్. ఇలా చీరలో చేసిన ఓ ఫొటో షూట్ ను అభిమానులతో పంచుకుంది. ఈ కన్నడ అందం నడుము ఒంపులు చూసి ఫ్యాన్స్ మైమరచిపోతున్నారు. నభా నటేష్ చివరిగా గతేడాది డార్లింగ్ సినిమాలో కనిపించింది. ప్రస్తుతం ఆమె చేతిలో ఎలాంటి ప్రాజెక్ట్ లేదు. నభా ఇన్‌స్టాగ్రామ్ లో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది. తరచూ ఇలా గ్లామరస్ ఫొటోలను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది

# అప్పుడు తమిళ బిగ్‌బాస్ లో..



గతంలో తమిళ బిగ్ బాస్ ఆరో సీజన్‌లో పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించిన ఆయేషా జీనత్ ఇప్పుడు బిగ్ బాస్ తెలుగు హౌస్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఐదో వైల్డ్ కార్డ్ కంటెస్టెంట్ గా హౌస్ లోకి అడు పెట్టింది. పేరుకు తమిళ నటే అయినా తెలుగు బుల్లితెర ఆడియెన్స్ కు ఈ ముద్దుగుమ్మ బాగా పరిచయం. 'సావిత్రి గారి అబ్బాయి' సీరియల్‌తో తో మంచి గుర్తింపు తెచ్చుకుందీ అందాల తార. అలాగే కిర్రాక్ బాయ్స్ ఖిలాడీ గర్ల్స్ రెండో సీజన్‌లోనూ పార్టిసిపేట్ చేసింది. ఇక బిగ్ బాస్ తమిళ ఆరో సీజన్ లో తన ఆట, మాట తీరుతో అందరి దృష్టిని ఆకర్షించింది. అదే సమయంలో కాంట్రవర్సీ కంటెస్టెంట్ గానూ నిలిచింది. ఒకానొక సమయంలో నటుడు హోస్ట్ కమల్ హాసన్ నే ఎదిరించి మాట్లాడింది. 'నన్ను తప్పుగా చిత్రీకరించొద్దు' అని డైరెక్టుగా ఆయనతోనే చెప్పేసింది. అప్పట్లో ఇది బాగా వైరల్ అయింది. ఆయేషా పేరు బాగా వార్తల్లో నానింది. కాగా బిగ్ బాస్ తెలుగు హౌస్ లోకి అడుగు పెట్టిన అయేషా తన లవ్ బ్రేకప్, మాజీ ప్రియుడి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. గతంలో తాను తమిళ బిగ్ బాస్ షోలో 65 రోజుల పాటు ఉన్నానని కానీ బయట తన ప్రియుడు వేరే అమ్మాయితో రిలేషన్ మెంటైన్ చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా నాగార్జున ఆయేషాకు గ్రీన్ స్టోన్ ఇచ్చారు. నామినేషన్స్ లో ఈ పవర్ ఉపయోగించి, జరిగే తీరుని మార్చొచ్చు. ఎలా ఉపయోగించొచ్చు అనేది బిగ్ బాస్ చెప్తాడని నాగ్ క్లారిటీ ఇచ్చారు. అలానే హార్ట్ సింబల్ ఇచ్చి.. హౌసులోని ఎవరికైనా ఇచ్చి, కారణం కూడా చెప్పాలన్నారు. దీంతో ఆయేషా ఇమ్మాన్యుయేల్‌కి హార్ట్ సింబల్ ఇచ్చేసింది.

# 'అన్నా జాగ్రత్త'.. 'పెద్ది'



గేమ్ ఛేంజర్ తర్వాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న సినిమా పెద్ది. ఉప్పెన ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తోన్న ఈ విలేజ్ స్పోర్ట్స్ డ్రామాలో బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండగా. ఈ సినిమా నుంచి ఇప్పటివరకు రిలీజైన పోస్టర్స్, గ్లింప్స్ అంచనాలు పెంచేశాయి. ఇప్పటికే చాలాభాగం షూటింగ్ పూర్తి చేసుకున్న పెద్ది సినిమా వచ్చే ఏడాది మార్చి 27న రామ్ చరణ్ పుట్టిన రోజు కానుకగా రిలీజ్ చేయనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ షూటింగ్ పూణేలో జరుగుతోంది. ఈ కొత్త షెడ్యూల్‌లో రామ్ చరణ్ తో పాటు జాన్వీ కపూర్ కూడా పాల్గొంటోంది. హీరో, హీరోయిన్లపై ఒక పాటను చిత్రీకరిస్తున్నారు. అయితే ఈ పాటకు సంబంధించిన ఓ చిన్న వీడియో క్లిప్ ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. ఇందులో హీరో రామ్ చరణ్ ఓ ఎత్తైన కొండ ప్రాంతంలో డ్యాన్స్ వేస్తూ కనిపించాడు. చూస్తుంటే ఇది చాలా రిస్కీ సీన్ లా కనిపిస్తోంది. ఎందుకంటే చుట్టూరా లోతైన లోయ, అందులోనూ ఎండిపోయిన చెట్టు కొమ్మపై ఓ కాలు, మరో కాలు బండరాయిపై ఉంచి తన బాడీని బ్యాలెన్స్ చేస్తూ ఈ స్టెప్పులేస్తున్నాడు గ్లోబల్ స్టార్. ప్రస్తుతం పెద్ది సాంగ్ షూట్ కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో బాగా వైరలవుతోంది. దీనిని చూసిన మెగాభిమానులు రామ్ చరణ్ డెడికేషన్ అండ్ డేరింగ్ కు ఫిదా అవుతున్నారు. రామ్ చరణ్ రియల్ హీరో అంటూ కాంప్లిమెంట్స్ ఇస్తున్నారు. అదే సమయంలో సినిమా కోసం ప్రాణాలు లెక్కచేయకపోవడంపై 'అన్నా జాగ్రత్త' అంటూ కామెంట్స్ పెడుతున్నారు. కాగా ఈ పాట విజువల్ ట్రీట్‌గా ఉంటుందని చిత్రబృందం చెబుతోంది.. అందుకే పర్వత ప్రాంతాల్లోనే ఎక్కువగా షూటింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ పాటకు జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు.

మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న పెద్ది సినిమా అరవై శాతం వరకూ షూటింగ్ పూర్తయినట్టు సమాచారం. త్వరలోనే ఈ సినిమా నుంచి ఫస్ట్ సాంగ్ రిలీజ్ చేస్తున్నట్లు సమాచారం.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**